# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి, ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి వెల్లడించారు.**
2. **విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఈరోజు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**
3. **జీఎస్టీ సంస్కరణలు పేద మధ్యతరగతి ప్రజల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**
4. **దేశ వ్యాప్తంగా ఎయిడ్స్ నియంత్రణ చర్యల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

==========================

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు 4వ రోజు కొనసాగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి ఉభయ సభలలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో రోడ్లు – వంతెనలకు సంబంధించి శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సమాధానమిస్తూ, రాష్ట్రంలో రహదారులను 1,080 కోట్ల రూపాయలతో గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టామని వెల్లడించారు. త్వరలోనే రహదారుల అభివృద్ధికి, ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ..

..వాయిస్…19 సెకన్లు

--------------------------

శ్రీకాకుళం జిల్లాలో శ్రీ కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఈరోజు నుండి ప్రారంభమైయ్యాయి. ఈ ఉత్సవాలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తమ్మ తల్లిని కుటుంబ సమేతంగా దర్శించుకొని, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, వస్తు సేవల పన్ను– జీఎస్టీ సంస్కరణలు పేద మధ్యతరగతి ప్రజల ఆర్థికఅభ్యున్నతికి దోహదపడతాయని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ పరికరాలపై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడంతో రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు.

--------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. వేదమాతగా ప్రసిద్ధి పొందిన ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ పంచ ముఖాలతో దర్శనమిచ్చే గాయత్రీదేవిని పూజిస్తే సకల ఉపద్రవాలూ తొలగుతాయనీ, బుద్ధి తేజోవంతం అవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

కాగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అమ్మవారిని ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నామని వెల్లడించారు.

---------------------------

వస్తుసేవల పన్ను-జీఎస్టీ శ్లాబ్‌ల మార్పుల ద్వారా నిత్యావసర వస్తువులు మరింత అందుబాటులోకి వచ్చాయని బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలోని ఎలక్ట్రానిక్ ఉపకరణాల దుకాణాన్ని ఆయన నిన్న సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..23 సెకన్లు

---------------------------

దేశ వ్యాప్తంగా ఎయిడ్స్ నియంత్రణ చర్యల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయా రాష్ట్రాలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వివిధ విభాగాల్లో చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ-ఎన్ఏసిఓ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ-ఏపీశాక్స్‌కు ఈ ర్యాంకును ప్రకటించిందని తెలిపారు. నిర్దేశించిన ప్రమాణాల మేరకు న్యాకో రాష్ట్రాలకు 132 స్కోరును నిర్ణయించగా... ఆంధ్రప్రదేశ్ శాక్స్ 98 స్కోరును సాధించిందని పేర్కొన్నారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ –యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను కేంద్రప్రభుత్వం ఎలా అందరికీ అందుబాటులోకి తెచ్చిందనే వివరాలను ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01.06 సెకన్లు)

---------------------------

మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అక్టోబర్ రెండవ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కృష్ణా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి వెంకట్రావు తెలిపారు. కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో ఈ రోజు ఆయన పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, ఈ శిబిరాల ద్వారా మహిళలు, కిషోర బాలికలకు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను గుర్తించే పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

---------------------------

భారతదేశ వారసత్వ వైద్యానికి ఆయుర్వేదం ప్రతీకగా నిలుస్తుందని విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఆయన ఈరోజు మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఈరోజు అంకురార్పణ జరగనుంది. ధ్వజారోహణానికి ముందురోజు చేపట్టే అంకురార్పణను ఆలయ సన్నిధిలో సేనాధిపతి విష్వక్సేనుని పర్యవేక్షణలో రాత్రి 7 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తారు. ఇప్పటికే ఈ ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి పూర్తిచేసింది.

=====================